

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 258 | పేజీలు : 8 | వెల : రూ.2/- సోమవారం 12 అక్టోబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

సీఎం విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించిన ప్రధాని మోదీ

రూ.13 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం



చెన్నై,మన జనప్రగతి, అక్టోబర్ 11: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం తమిళనాడులో పర్యటించారు. చెన్నై మెట్రో రైలు రెండో దశలో భాగంగా రూ.4,900 కోట్ల వ్యయంతో నిర్మించిన పూందమల్లివడపళని మార్గాన్ని ప్రారంభించారు. అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌తో కలిసి పోరూరు బైపాస్ స్టేషన్ నుంచి మిగతా2లో...

సుప్రీంకోర్టుకు మార్చ్‌గా తరలిరండి!

యువతకు రాహుల్‌గాంధీ పిలుపు

ఓట్ల చోరీని అడ్డుకోవాలి.. సీఈసీ రాజీనామా చేయాలి

సోమవారం ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరసన ప్రదర్శన



2లో

ఢిల్లీలో యువతపై పోలీసుల లాఠీచార్జి!

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ ఆందోళనలు

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్‌పై దాడి.. ఆస్పత్రికి తరలింపు

విద్యార్థులు, యువజన సంఘాల కార్యకర్తల అరెస్టులు



న్యూఢిల్లీ,మన జనప్రగతి, అక్టోబర్ 11:దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువజన సంఘాల ఆందోళనలపై పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు కఠినంగా వ్యవహరించాయని నవతెలంగాణ కథనం పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన మిగతా2లో...

సర్‌తో గట్టెక్కేందుకు కమలం కుట్ర!

● గోవాలో ఓట్ల తొలగింపుతో మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ యత్నం ● భూములు అన్యాక్రాంతం.. అభివృద్ధిని గాలికొదిలేశారు ● బీజేపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,మన జనప్రగతి, అక్టోబర్ 11: గోవాలో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ఓట్ల తొలగింపుతో మూడోసారి అధికారంలోకి రావాలని కమలం పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.గోవా కాంగ్రెస్ మిగతా2లో...



స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

నేతలంతా సమన్వయంతో పనిచేయాలి: చంద్రబాబు

అమరావతి,మన జనప్రగతి, అక్టోబర్ 11: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ సన్నాహాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముమ్మరం చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నేతలకు సూచించారు. మంత్రులు, జిల్లా మిగతా2లో...

గిరిజన గ్రామాలకు అభివృద్ధి బాట!

రహదారుల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం: పవన్ కల్యాణ్

రూ.2,052 కోట్లతో 'అడవితల్లి బాట 2.0' పనులు



2లో

బారికేడ్లు తొలగించండి.. మెట్రోను నడపండి!

● కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ● ప్రజా రవాణాను నిలిపివేయడం సరికాదు

● శాంతియుత నిరసనలకు అవకాశం కల్పించాలి.. అక్రమ నిర్బంధాలు వద్దు



న్యూఢిల్లీ,మన జనప్రగతి, అక్టోబర్ 11: దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రహదారులపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వెంటనే సమీక్షించి, శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ అవసరాలకు తప్పనిసరి కానివాటిని తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో రైళ్లు, రైల్వే సేవలను సాధారణంగా కొనసాగించాలని, ప్రజల రాకపోకలకు అనవసరమైన ఆటంకాలు కల్పించవద్దని స్పష్టం చేసింది.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జరిగిన నిరసనల నేపథ్యంలో పోలీసులు విధించిన మిగతా2లో...


భారత్ - జపాన్ స్నేహబంధం చిరకాలం!

● సాంకేతికత, పరిశ్రమలు, పెట్టుబడుల రంగాల్లో మరింత సహకారం

● హైదరాబాద్‌లో ఘనంగా జపాన్ ఫెస్టివల్2026 ● పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలే రెండు దేశాల బంధానికి పునాది: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



హైదరాబాద్,మన జనప్రగతి, అక్టోబర్ 11: భారత్, జపాన్ దేశాల మధ్య ఎన్నో ఏళ్లుగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్నాయని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో నిర్వహించిన జపాన్ ఫెస్టివల్2026లో రాష్ట్ర విద్యుత్, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన మిగతా2లో...



2లో

నాలుగైదు రోజుల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన!

- ఆశావహుల జాబితా అధిష్ఠానానికి పంపించాం: రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. యాసంగి సాగు వద్దు!



2లో

సిరిసిల్లలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపట్టండి!

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ విజ్ఞప్తి

- రూ.402 కోట్లతో మంజూరైన పనుల్లో జాప్యం ఎందుకు?

- కొత్త భవనం పూర్తయ్యే వరకు ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించాలి



2లో

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

ఢిల్లీలో యువతపై పోలీసుల లాఠీచార్జి!

(మొదటి పేజీ తరువాయి)

సంఘాలు ఆదివారం కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో నిరసనలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయగా, లాఠీచార్జిలో కొందరు గాయపడినట్లు కథనం తెలిపింది.రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ సమీపం నుంచి జంతర్ మంతర్ వైపు ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలను పాలికా బజార్ ప్రాంతంలో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆందోళనకారులను చుట్టుముట్టి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారని, వాహనాల్లోనూ దాడులు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని కథనం పేర్కొంది. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు నిరసనల్లో పాల్గొన్నారు.సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ నిరసన ప్రాంతంలో మీడియాతో మాట్లాడుతుండగా పోలీసులు ఆయనపై దాడి చేశారని కథనం ఆరోపించింది. ఆయన స్పృహ కోల్పోయిన అనంతరం రోడ్డుపక్కన వదిలివేయగా, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆటోలో రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బ్రిట్టాస్‌ను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఇతర నాయకులు పరామర్శించారు.ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీగా పోలీసు, కేంద్ర భద్రతా బలగాలను మోహరించినప్పటికీ ఆందోళనలు కొనసాగాయని కథనం వివరించింది. సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల్లో నిరసనలు, అరెస్టులు కొనసాగినట్లు పేర్కొంది. ఎన్నికల కమిషన్ వ్యవహారాలు, ఓటర్ల జాబితాపై నిరసనకారులు ప్రశ్నలు లేవనెత్తుతూ సీఈసీ రాజీనామాను డిమాండ్ చేశారు.

సర్‌తో గట్టెక్కేందుకు కమలం కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో ఆదివారం చీఫ్టెన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండ్ వరకు నిర్వహించిన పాదయాత్రలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. గోవాలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే స్థానిక ప్రజలు తమ సొంత రాష్ట్రంలోనే పరాయివారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల భూములు, ఆస్తులు, హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్‌గాంధీ ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గోవా పర్యటనకు రావాల్సి ఉన్నప్పటికీ, ఢిల్లీలో నిరసన కార్యక్రమాల కారణంగా రాలేకపోయారని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ప్రతినిధిగా తాను గోవాకు వచ్చానని చెప్పారు. బీజేపీ పాలనలో రాష్ట్రంలోని భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, అభివృద్ధిని పక్కనపెట్టి స్థానిక ఆస్తులను ఇతరులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.గోవా యువత మాదకద్రవ్యాల బారిన పడుతోందని, రాష్ట్రం మాదకద్రవ్యాల సరఫరాకు కేంద్రంగా మారుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'నషా ముక్త్ భారత్' గురించి మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి గోవాలో ఈ సమస్యను ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ ముఠాలు, భూకబ్జాదారుల ప్రభావం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని సూచించారు. గోవా ప్రజలు గతంలో రెండుసార్లు బీజేపీని నమ్మి మోసపోయారని, మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని రేవంత్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్‌కు కాకుండా ఇతర పార్టీలకు వేసే ఓట్లు బీజేపీకి లాభం చేకూర్చవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. గోవా ప్రజల హక్కులు, భూములు, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని తెలిపారు.బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోరును రాముడు, రావణుడి మధ్య పోరుతో పోల్చిన రేవంత్‌రెడ్డి.. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ దేశాన్ని ఏకం చేసేందుకు భారత్ జోడో యాత్ర చేపట్టారని, ప్రధాని మోదీ దేశంలో విభజన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గోవా ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. 2026లో కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్న రేవంత్‌రెడ్డి, 2027లో గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు త్రివర్ణ పతాకం ఎగరడం ఖాయమని వ్యాఖ్యానించారు.**స్థానిక గుర్తింపును కాపాడేందుకు యాత్ర** గోవా భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ 'గోయ్ రాఖోన్స్' యాత్రను చేపట్టింది. గత నెల 22న పనాజీలో ప్రారంభమైన ఈ యాత్ర 27 రోజులపాటు రాష్ట్రంలోని 40 నియోజకవర్గాలను కవర్ చేయనుంది. 18న యాత్ర ముగియనుంది. బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం తోపాటు స్థానిక హక్కుల పరిరక్షణకు మద్దతు కూడగట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

గిరిజన గ్రామాలకు అభివృద్ధి బాట!

పోలవరం జిల్లా, మన జనప్రగతి, అక్టోబర్ 11: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంతోపాటు విద్య, వైద్యం, రవాణా, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఆదివారం పోలవరం జిల్లా కాకవాడలో పర్యటించిన ఆయన 'అడవితల్లి బాట' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రహదారులు లేక గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బంది దులను ప్రస్తావిస్తూ, వైద్య సేవల కోసం రోగులను డోలీలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితులు మారాలని పవన్ కల్యాణ్ అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి అధిక వ్యయం అవుతున్నప్పటికీ వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. రోడ్డు లేని గిరిజన గ్రామం ఉండకూడదనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.'అడవితల్లి బాట 2.0'లో భాగంగా రూ.2,052 కోట్లతో 1,341 గిరిజన ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రహదారి సౌకర్యం కల్పిస్తే గిరిజన విద్యార్థులకు పాఠశాలలకు వెళ్లడం, ప్రజలకు వైద్య సేవలు పొందడం, రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లకు తీసుకెళ్లడం సులభమవుతుందని వివరించారు.అల్లూరి సీతారామరాజు తనకు స్ఫూర్తి అని, గిరిజనుల సంక్షేమం కోసం పనిచేయడం బాధ్యతగా భావిస్తున్నానని పవన్ కల్యాణ్ అన్నారు. రాకోట ప్రాంతంలో వెదురుతో వస్తువులు తయారు చేసే గిరిజనులకు మార్కెట్ సదుపాయం కల్పించేం దుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, ప్రస్తుతం అభివృద్ధిపైనే దృష్టి పెట్టామని పేర్కొన్న పవన్ కల్యాణ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

సిరిసిల్లలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపట్టండి!

హైదరాబాద్,మన జనప్రగతి, అక్టోబర్ 11:రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపట్టి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాలేదని కేటీఆర్ పేర్కొన్నారు. మండేపల్లి గ్రామంలో కళాశాల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు మొదలుకాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ప్రస్తుత ప్రాంగణం నుంచి కళాశాలను మరో ప్రైవేటు భవనానికి తరలించాలనే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తరగతులు, విద్యా కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేసి, పనులను వేగవంతం చేయాలని కేటీఆర్ కోరారు. కొత్త క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగిం చేందుకు అనుమతించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ అంశంపై తక్షణమే స్పందించాలని కోరారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం..

యాసంగి సాగు వద్దు!

- **రైతులకు మంత్రి పొంగులేటి సూచన**
- **సాగునీటితోపాటు తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం**
- **నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి**

హైదరాబాద్,మన జనప్రగతి, అక్టోబర్ 11:ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాలు తగ్గే అవకాశం ఉందని, దీంతో సాగునీటితోపాటు తాగునీటి అవసరాలను తీర్చడం సవాలుగా మారవచ్చని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఈ యాసంగిలో పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు.ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని కోరారు. వ్యవసాయ అవసరాలతోపాటు ప్రజల తాగునీటి అవసరాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.విద్యుత్ వినియోగంలోనూ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన మేరకే విద్యుత్‌ను ఉపయోగించాలని పొంగులేటి సూచించారు. భవిష్యత్తులో నీటి కొరతతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం సూచించే మార్గదర్శకాలను రైతులు, ప్రజలు పాటించాలని కోరారు.

జిబూటీలో ఘోర

పడవ ప్రమాదం..139 మంది మృతి

- మరో 116 మంది గల్లంతు.. మృతుల్లో 15 మంది చిన్నారులు

జిబూటీ, మన జనప్రగతి, అక్టోబర్ 11: తూర్పు ఆఫ్రికా దేశమైన జిబూటీ తీరంలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. వలసదారులతో యెమెన్‌కు వెళ్తున్న పడవ బోల్తాపడటంతో 139 మంది మరణించగా, మరో 116 మంది గల్లంతయ్యారు. ఈ విషయాన్ని అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) వెల్లడించింది. ఈ నెల 8న సుమారు 350 మందితో బయలుదేరిన పడవ, ఒబాక్ పట్టణానికి ఉత్తరాన గుహెరా సమీపంలో ప్రమాదానికి గురైంది. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉన్నారు. 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం. గల్లంతైన వారి కోసం జిబూటీ అధికారులు, ఐఓఎం సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. బాధితులకు వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం కల్పిస్తున్నారు.ఆఫ్రికా దేశాల నుంచి గల్ఫ్ ప్రాంతాలకు వెళ్లే వలసదారులు ఈ ప్రమాదకర సముద్ర మార్గాన్ని వినియోగిస్తుంటారు. ఉపాధి, మెరుగైన జీవితం కోసం చేపడుతున్న ప్రయాణాలు ప్రాణాంతకంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వలసదారుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

సీఎం విజయ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించిన ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

పూందమల్లి బైపాస్ స్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు.ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో రూ.13 వేల కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు చేశారు. పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. చెన్నై మెట్రో రెండో దశలోని కొత్త మార్గం నగరంలోని పలు ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరచనుంది. ఈ మార్గంలో ప్రత్యేకంగా 3.7 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ నిర్మాణం ఉంది.రోడ్డు రవాణా, రైల్వేలు సహా వివిధ రంగాలకు చెందిన ప్రాజెక్టులు తమిళనాడు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడతాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మెట్రో ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి విజయ్ కలిసి రైలులో ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ం

సుప్రీంకోర్టుకు మార్చ్‌గా తరలిరండి!

న్యూఢిల్లీ,మన జనప్రగతి, అక్టోబర్ 11: యువతపై పోలీసులు, బీజేపీకి చెందిన వ్యక్తులు దాడులు చేశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సంఘాలు, ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్నవారంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఢిల్లీలో శనివారం శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై దాడులు జరిగాయని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఓట్ల చోరీ ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం అందజేస్తామని వెల్లడించారు.పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా నిలవాలని రాహుల్‌గాంధీ కోరారు. ప్రేమ, సోదరభావం, దేశభక్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, పరిశీలకులు, ముఖ్య నేతలతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.2024 ఎన్నికల కంటే ఎక్కువ ఓట్ల శాతం సాధించేలా కృషి చేయాలని, నేతల పనితీరును సమీక్షించి రేటింగ్‌లు ఇస్తామని చంద్రబాబు తెలిపారు. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం క్షేత్రస్థాయి వరకు ఉండాలని, ఉమ్మడిగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాబోయే 50 రోజులు ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేయాలని పేర్కొన్నారు.స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం మేర పార్టీ టికెట్లు కేటాయించే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు. 'జయహో బీసీ! జనాభాలో సగంకూటమి ఇచ్చింది బలం' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేపట్టాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని నేతలకు చెప్పారు.స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిస్తే రాష్ట్రంలో 'ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పడుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కూటమి సమన్వయ కమిటీలను క్రియాశీలం చేయాలని, ప్రత్యర్థి పార్టీల విమర్శలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

బారికేడ్లు తొలగించండి.. మెట్రోను నడపండి!

(మొదటి పేజీ తరువాయి)

ఆంక్షలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే వారిని అక్రమంగా నిర్బంధించరాదని, చట్టప్రకారం మాత్రమే చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు, ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలకు అవకాశం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంది. శాంతిభద్రతలను కాపాడే పేరుతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని సూచించింది. ఇంటర్నెట్ సేవలకు అనవసరంగా అంతరాయం కలగకుండా చూడాలని కూడా ఆదేశించింది.మెట్రో, రైల్వే స్టేషన్ల మూసివేతతో ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. భద్రతా కారణాలతో అవసరమైన పరిమితులు విధించవచ్చని, అయితే ప్రజా రవాణా పూర్తిగా నిలిచిపోయేలా చర్యలు ఉండకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది.ప్రజల ప్రయాణ స్వేచ్ఛను కాపాడుతూ, చట్టబద్ధమైన పరిమితుల పరిధిలో శాంతిభద్రతలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు సూచించింది.

భారత్ - జపాన్ స్నేహబంధం చిరకాలం!

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. సాంకేతికత, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, విద్య, సాంస్కృతిక మార్పిడి వంటి రంగాల్లో భారత్, జపాన్ సంబంధాలు గణనీయంగా అభివృద్ధి చెందాయని చెప్పారు. హైదరాబాద్ సమాచార సాంకేతికత, ఔషధాలు, జీవసాంకేతికత, పారిశ్రామిక అభివృద్ధి రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు.జపాన్‌లోని హిరోషిమా ప్రాంతంతో పెట్టుబడులు, ఆధునిక తయారీ, సాంకేతికత, నూతన ఆవిష్కరణల రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకునేందుకు అవకాశాలు ఉన్నాయని స్పీకర్ పేర్కొన్నారు. హిరోషిమా శాంతి, స్థిరత్వం, మానవ సంకల్పానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు.భారత్, జపాన్ మధ్య ఇప్పటికే ఉన్న స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని, ప్రజల మధ్య పరస్పర సంబంధాలు పెంపొందించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఇరు దేశాల సహకారం ద్వారా పారిశ్రామిక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు.


నాలుగైదు రోజుల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన!

- **ఆశావహుల జాబితా అధిష్ఠానానికి పంపించాం: రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

హైదరాబాద్,మన జనప్రగతి, అక్టోబర్ 11: తెలంగాణలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నాలుగైదు రోజుల్లో బీజేపీ అభ్యర్థులను ప్రకటిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులుగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల పేర్లను ఇప్పటికే పార్టీ అధిష్ఠానానికి పంపించామని వెల్లడించారు. తుది నిర్ణయం అధిష్ఠానమే తీసుకుంటుందని స్పష్టం చేశారు.ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయాలా? వద్దా? అనే అంశంపై కూడా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని రాంచందర్‌రావు పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.అంతకుముందు రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఇప్పటికే కాంగ్రెస్ తన అభ్యర్థులను ప్రకటించగా, బీఆర్ఎస్ కూడా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది.

పీజీఆర్ఎస్ సేవలపై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

● జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప టౌన్, మన జనప్రగతి, అక్టోబర్ 11:- ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కోరారు.పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలతో పాటు హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సేవలు పొందిన వెంటనే మొబైల్ ఫోన్‌తో కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చన్నారు.ప్రజలు తమ అర్జీల స్థితిని తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా, మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించి, సేవలపై తమ స్పందనను తెలియజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం..!

కడప,టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 11:- జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి: కమిషనర్ ఎం.జయకృష్ణ



తిరుపతి మన జనప్రగతి అక్టోబర్ 11:- నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో అక్టోబర్ 12 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

18 మందికి రోగులకు ఆపరేషన్లు



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 11:-రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 18 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు.ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట,రైల్వే కోడూరు,సుండుపల్లె,వీరబల్లి, యర్రావారి పాలెం, కేవీపల్లి,కలకడ,కలికిరి,పీలేరు, గుర్రం కొండ,పెద్దమండెం,ఎన్.పి.కుంట, చక్రాయపేట, కడప తదితర ప్రాంతాల నుండి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 18 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు.అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు,అద్దాలు పంపిణీ చేశారు.అనంతరం కంటి ఆపరేషన్ ల కోసం వచ్చిన కంటి రోగులతో పాటు వారి వెంట ఉన్న సహాయకులకు అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రంకొండ మండలం నడిమి కండ్రిగ పంచాయతీలోని మొటుకు గ్రామానికి చెందిన దాత ఎన్నారై ఎర్రగొండ గోవర్ధన్ రెడ్డి ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప్ గుప్తా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాషా,కంటి వైద్యులు సురేష్ బాబు,భార్గవి,ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కోచింగ్ ప్రారంభం



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 11:-పత్తికొండ జూనియర్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కోచింగ్ శిబిరాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 10 నుంచి 15వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి బత్తిన లోకనాథ్, ప్రకాష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల కార్యదర్శి చందు నాయక్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు పాండురంగరాజు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. క్రీడాకారులకు రంగస్వామి, రాము కరణం శిక్షణ అందిస్తున్నారు.ఈ సందర్భంగా బత్తిన లోకనాథ్ మాట్లాడుతూ క్రీడాకారులు శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మధు, హరి, ఆర్ఎంఎస్ మేనేజర్ రమేష్, వార్డెన్ నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల ఆల్విన్ కాలనీ..?

అడ్డు చెప్పాల్సిన అధికారులే ఆజ్యం పోతున్నారా..?

టౌన్ ప్లానింగ్ ఆదాయం నిల్లు..అధికారుల జేబులు ఫుల్లు..!



కూకట్ పల్లి మన జనప్రగతి అక్టోబర్ 11:- హైదరాబాద్ మహానగరంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ, రోజురోజుకూ పాపం పండినట్లు విస్తరిస్తున్నాయి. నిబంధనల ప్రకారం అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగమే వాటికి దన్నుగా నిలుస్తూ ఆజ్యం పోస్తోందన్న విమర్శలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి.నిబంధనలను తుంగలో తొక్కి సాగుతున్న ఈ అక్రమాల వల్ల టౌన్ ప్లానింగ్ విభాగానికి వచ్చే ఆదాయం పూర్తిగా 'నిల్లు'గా మారుతుండగా, సంబంధిత అధికారుల జేబులు మాత్రం భారీగా 'ఫుల్లు' అవుతున్నాయన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. సైబరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆల్విన్ కాలనీ సర్కిల్, పైప్‌లైన్ రోడ్డులో ఒక నిర్మాణదారుడు నిబంధనలను గాలికొదిలేసి సాగిస్తున్న వ్యవహారం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. కేవలం ఒకటి లేదా రెండు అంతస్తులకే అనుమతులు తీసుకుని, క్షేత్రస్థాయిలో ఏకంగా సెల్లార్‌తో పాటు ఐదున్నర అంతస్తుల భారీ భవనాన్ని యథేచ్ఛగా నిర్మిస్తుండటం స్థానికులను అవాక్కయ్యేలా చేస్తోంది. ఇంతటి భారీ అక్రమ కట్టడం కళ్లెదుటే సాగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున చేతులు మారాయనే అనుమానాలు బలపడుతున్నాయి. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ అక్రమార్కులకు కొమ్ముకాయడం మానుకుని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సదరు అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఓటు హక్కు ప్రతి ఒక్కరి జన్మహక్కు

కాకినాడలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'వాక్ ఫర్ డెమోక్రసీ'

ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 11:-ఓటు హక్కు ప్రతి భారతీయుడి హక్కు అని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం కాకినాడ గాంధీ పార్క్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదుల ఆధ్వర్యంలో వాక్ ఫర్ డెమోక్రసీ కార్యక్రమాన్ని నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి. బేబీరాణి, జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జి, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర వర్మ, అంబేద్కర్ ఉద్యమ నేతలు అయితాబత్తుల రామేశ్వరరావు, పిల్లి రామారావు తదితరులు మాట్లాడారు.భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీకి వెళ్లే రైలు సర్వీసుల నిలిపివేత, మెట్రో రైళ్ల రద్దుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయాలు రాజ్యాంగం కల్పించిన హక్కులను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.ఎన్నికల కమిషన్ నిర్ణయాలు అధికార పార్టీకి అనుకూలంగా మారుతున్నాయని వారు ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ప్రజాస్వామ్య ఉద్యమంలో ప్రజలంతా ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. 1923లో భారత జాతీయ కాంగ్రెస్ అఖిల భారత మహాసభలు గాంధీ పార్క్ ప్రాంతంలో జరిగిన నేపథ్యంలో అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ, యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక, ఐలు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్, పోర్ట్ యూనియన్ తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలువురు చిన్నారులు జాతీయ జెండాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన సమీక్ష సమావేశం




దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 11:-రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంతో పాటు జనసేన పార్టీ బలోపేతంపై దేవనకొండలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని జనసేన అతిథి గృహంలో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ నిర్వహణ కమిటీ సభ్యులు బోయ సరోజ, గాజుల జగదీష్, ఆంటోనీలను అభినందించారు. అనంతరం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, గ్రామ, మండల స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను మెరుగుపరిచేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా కూటమి నాయకులతో సమన్వయం చేసుకుంటూ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఐకమత్యంతో, క్రమశిక్షణతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన మండల నాయకులు ఏ. ఉచ్చారప్ప, నందు, బడే సాహెబ్, లక్ష్మన్న, రామాంజనేయులు, బంగి చంటి, బాలు, తిప్పన్న, రంగస్వామి, తిక్కయ్య, కృపాకర్, రమేష్, బ్రహ్మానంద, హబీబా, తేజ, భాష, వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లిలో అట్టహాసంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 11:-వేంపల్లె పట్టణంలో 122 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు టి.చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు బి.భాగ్యేశ్వరమ్మ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, ఆర్యవైశ్య సంఘం ముఖ్య నాయకుడు బైరిశెట్టి బాలగంగాధర్ దంపతులతో పాటు ఇతర మహిళలు ఊరేగింపుగా మెయిన్ బజార్ లోని ఆంజనేయ స్వామి ఆలయంనుంచి 108 కలశాలతో పవిత్ర జలాన్ని మంగళ వాయిద్యాలతో అమ్మవారిశాలకు తీసుకువచ్చి ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో వాసవి మాతకు అభిషేకం పంచామృతాభిషేకం,నివేదన, మంత్రపుష్పం, మహామంగళ హారతి,తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం వాసవి కన్యకాపరమేశ్వరి దేవి, రాత్రి శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో వాసవి మాత భక్తులను కటాక్షించారు అన్నారు.మూలవిరాట్ అమ్మవారిని బంగారు చీరతో అలంకరించి భక్తులకు క్యూ లైన్లో దర్శనం కల్పించారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో 10రోజులు అర్చకులు శాకల్య నరసయ్య నేతృత్వంలో జపహోమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు భారీ స్వాగత ముఖద్వారాలు, పందిర్లు, ఆలయంలో విద్యుత్ దీపాలంకరణ, పట్టణంలోని ప్రధాన రహదారుల్లో నవదుర్గా కటౌట్లతో ముస్తాబు చేశారు.ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి కళ్యాణ మండపం,ఆర్యవైశ్య మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




భాకరాపేట,మాచుపల్లి మధ్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబరు 11:-సిద్ధవటం ఎక్సైజ్ పరిధిలోని భాకరా పేట, మాచుపల్లి మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం రీ-నోటిఫికేషన్ విడుదల చేసిందని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం సిద్ధవటంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ, ఆసక్తి ఉన్నవారు ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 21న కడప కలెక్టర్ కార్యాలయంలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన మద్యం దుకాణాల లైసెన్సుదారుల పేర్లను ప్రకటిస్తామని వెల్లడించారు.

రాజరాజేశ్వరి దేవి అలంకారంలో శ్రీశ్రీశ్రీ దర్గా మాతాజీ



రామాపురం మన జనప్రగతి అక్టోబర్ 11:-మండలంలోని నీలకంఠరావుపేట గ్రామం దర్బార్ సాయి నగరంలో వెలసిన శ్రీశ్రీశ్రీ దుర్గామాతజి నవరాత్రి ఉత్సవాలు భాగంగా ఆదివారం రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు ఈ ఉత్సవాల్లో వేద పండితులు అమ్మవారికి కలశ పూజా నైవేద్య కైంకర్యాలు నిర్వహించి విశేష అలంకారంతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. వచ్చిన భక్తాదులకు అమ్మవారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు సత్యమయ్య స్వామి శంకరయ్య స్వామిలు తెలియజేశారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి విశేషమైన అలంకరణలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృపా కటాక్షం పొందాలని తెలియజేశారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 11:-కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో ఆదివారం రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

దుర్గమ్మ ఆలయంలో ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 11:-స్థానిక సాయి నగర్ లోని శ్రీ దుర్గమ్మ ఆలయంలో ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి. అర్చకుడు శాకల్య విష్ణుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 10 రోజుల పాటు ప్రతిరోజు ఓ ప్రత్యేక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు, జడ్పిటిసి మాజీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తంగేడుపల్లి స్మశాన వాటిక నిర్మాణ పనులు ప్రారంభం.!

● సమాజానికి అండగా మంచి పనులు సేవా ఫౌండేషన్



పోరుమామిళ్ల /బి.కోడూరు మన జనప్రగతి అక్టోబర్ 11:- బి.కోడూరు మండలంలోని తంగేడుపల్లి గ్రామంలో హిందూ స్మశాన వాటికను ప్రముఖ సమాజ సేవికుడు డాక్టర్ పెద్దిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి తన స్వంత నిధులు వెచ్చించి చదును చేయించి శుభ్రం చేయించారు. ముళ్లపొదలు, రాళ్లు, రప్పలు, గాజు పెంకులు, గుంతలతో, గందరగోళంగా, భయానకంగా వున్న 96 సెంట్ల స్మశాన వాటిక స్థలాన్ని జేసీబీలతో శుభ్రం చేయించి తొలగించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు గ్రామంలో ఎవరైనా చనిపోతే పార్తివ దేహాన్ని కంప చెట్ల మధ్యలో ఇబ్బందికర దారిలో తీసుకెళ్లి దహన సంస్కారాలు చేయాల్సి వచ్చేదని, ఎంతో కష్టపడాల్సి వచ్చేదని, సతీష్ రెడ్డి దయవల్ల ఇబ్బందులన్నీ తొలగిపోతున్నాయని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం శుభ్రం మాత్రమే చేయించామని, త్వరలో స్మశానం లోపల భాగంలో అవసరమైన అన్ని వసతులను కల్పించడంతోపాటు ప్రహరీ గోడ కూడా నిర్మించి గేట్ వేయించి గ్రామస్తులకు తాళంచెవి అందిస్తామన్నారు. మూడు నెలల కాల వ్యవధిలో మొత్తం నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. "మంచి పనులు సేవా ఫౌండేషన్" ద్వారా ప్రజల ప్రేమ, ఆధారాభిమానాలతో ముందుకుపోతూ బద్వేల్ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృత పరుస్తామన్నారు. స్వంత ప్రయోజనాలు ఆశించకుండా నిస్వార్థంగా ఇలాంటి మహోత్తర కార్యాలు చేపడుతూ సమాజానికి అండగా నిలుస్తున్న పెద్దిరెడ్డి సతీష్ రెడ్డిని ప్రజలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

103 మందికి కంటి పరీక్షలు 22 మందికి ఆపరేషన్



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 11:- స్థానిక డాక్టర్ లక్ష్మీప్రసాద్ హాస్పిటల్ (రాయచోటి మల్టీస్పెషల్టి హాస్పిటల్) నందు ఆదివారం కంటి వైద్య శిబిరం తిరుపతి అరవింద్ ఐ హాస్పిటల్ ద్వారా నిర్వహించడం జరిగిందని అందులో 103 కంటి పరీక్షలు చేయగా 22 మంది ఆపరేషన్ నిమిత్తం సెలక్షన్ చేయడం జరిగిందని అధ్యక్షులు లయన్ ఎస్ రామాంజనేయరెడ్డి తెలియజేశారు అనంతరం వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి ఎస్ హరినాథ్ రెడ్డి లయన్ మిక్కిలినేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం నందు కంటి చూపుతో ఇబ్బంది పడుతున్న వారికి ఏ ఇబ్బందులు లేకుండా ఉచితముగా మేము ఆపరేషన్ చేయించాలని ఉద్దేశంతో తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి వారి సహాయ సహకారాలతో డాక్టర్ లక్ష్మీప్రసాద్ సహకారంతోపూర్తిగా కంటిచూపు నిర్మూలన చేయాలని ఉద్దేశంతో ఈ క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాబోయే రోజులలో రాయచోటలోనే ఆపరేషన్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని త్వరలో అది కూడా జరుగుతుందని తెలియజేశారు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు అనంతరం ఫస్ట్ రీజన్ చైర్మన్ లయన్ ఎస్ మహమ్మద్ మరియు జోన్ చైర్మన్ పి శివారెడ్డి మాట్లాడుతూ సెలక్షన్ అయిన వారికి రేపు ఆపరేషన్ చేయించి అవసరమైతే మందులు ఇచ్చి పంపుతామని ఆసుపత్రి వాళ్ళు చెప్పినట్లు మందులు జాగ్రత్తగా వాడుకోవాలని అందరూ ఆరోగ్యకరంగా ఉండాలని కోరినారు కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి యస్ ఇమ్మాద్ లయన్ వి మురళి రెడ్డి అరవింద్ ఐ హాస్పిటల్ ఏరియా క్యాంప్ మేనేజర్ గౌరీ శంకర్ మరియు సిబ్బంది లక్ష్మీప్రసాద్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో నందా దీపాల పూజ



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 11:-శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక గోడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో నందా దీపాల పూజా కార్యక్రమాన్ని పురోహిత బ్రహ్మ యాతగిరి మద్వేషాచార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం తైలా (నువ్వుల నూనె)మరియు గృత (ఆవు నెయ్యి) నందా దీపాలతో ఈ తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తుల గోత్రనామాలు పేర పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉత్తరాది మఠాధిపతులు శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ ఆశీస్సులతో ఈ విశేష కార్యక్రమాన్ని మా తాతగారు జ్యోతిష పండితులు కృష్ణమూర్తి ఆచార్, అనంతరం డాక్టర్ పరశురామ్ పర్యవేక్షణలో నిర్వహిస్తూ వస్తున్నారని గత 20 సంవత్సరాలుగా మా ఆధ్వర్యంలో నందా దీప పూజా కార్యక్రమాన్ని నిర్విఘనంగా జరిపిస్తున్నట్లు మద్వేష్ ఆచార్ వివరించారు. గురువులైన శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ త్వరగా విశ్రాంతి నుండి కోలుకోవాలని భక్తులందరికీ దర్శన, ముద్ర ధారణ, అనుగ్రహ సందేశం తో పాటు సంచార కార్యక్రమాన్ని ప్రారంభించాలంటూ శ్రీ మూలరామదేవులు మరియు ఉపాసకులైన నరసింహ స్వామిని ప్రార్థిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఈనెల 18వ తారీఖున ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి రామనామ జపము,శ్రీ దాసాంజనేయ స్వామి వారికి మధు అభిషేకము తో పాటు ధన్వంతరి మరియు నరసింహ స్వామి మంత్రాలతో ప్రత్యేక హోమ కార్యక్రమాన్ని భక్తులు సహకారంతో నిర్వహించదలిచామని మద్వేషాచార్ వివరించారు. ఈ నవరాత్రుల్లో శ్రీ వెంకటేశ్వర కళ్యాణ వైభవాన్ని డా. పరశు రామ్ పారాయణ చేస్తారని తెలిపారు. హోమ కార్యక్రమంలో పురుషులు పాల్గొని హావిస్సు వేయవచ్చని అయితే సంప్రదాయ దుస్తులను మాత్రమే ధరించి పాల్గొనవలసి ఉంటుందని చెప్పారు.మహిళలు పాల్గొని నరసింహసులాది తో పాటు పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని మద్వేష్ ఆచార్ చెప్పారు.ఇతర వివరాలకు 9640 662837, 80740 53986లో సంప్రదించవచ్చని ఆయన చెప్పారు. నందా దీప పూజా సేవా కార్యక్రమంలో భక్తులు తమ సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. నందా దీప పూజ ప్రారంభ కార్యక్రమంలో పన్యాల నరసింహారావు (బుజ్జి),పాలకొల్లు రాఘవేంద్ర స్వామి మఠానికి చెందిన ప్రధాన అర్చకులు యాతగిరి భీమసేన చార్, శ్రీమతి పద్మావతి రాజమండ్రి కి చెందిన చిల్లరగ వెంకట్రావు శ్రీమతి చిల్లరగ పద్మావతి పద్మావతి,రఘోత్తమాచార్ శ్రీ రమామణి, డా. పరశు రామ్, శ్రీమతి తుంగమణి తో పాటు పలువురు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో 50 శాతం యువతకు అవకాశం కల్పించాలి

● బీసీలు, క్షత్రియులకు ప్రాధాన్యత ఇవ్వాలి

● పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలి: కేకే చౌదరి



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 11:-స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం యువతకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కేకే చౌదరి కోరారు. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన బీసీలు, క్షత్రియులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రైల్వేకోడూరులో ఆయన మాట్లాడుతూ పార్టీ జెండాను మోస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు స్థానిక సంస్థల్లో తగిన గుర్తింపు కల్పించాలన్నారు. సర్పంచులు, మండల ప్రాదేశిక సభ్యులు (ఎంపీటీసీలు), మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు), జిల్లా ప్రాదేశిక సభ్యులు (జెడ్పీటీసీలు) వంటి పదవుల్లో వారికి అవకాశాలు కల్పించి గౌరవించాలని కోరారు.ముఖ్యంగా రైల్వేకోడూరులో సంప్రదాయబద్ధంగా పార్టీకి మద్దతుగా నిలుస్తున్న బీసీ, క్షత్రియ సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కేకే చౌదరి సూచించారు. ఓబులవారిపల్లి, చిట్వేలి మండలాల్లో యాదవులకు, పుల్లంపేట మండలంలో పద్మశాలీలకు, పెనగలూరు మండలంలో ముదిరాజులకు, రైల్వేకోడూరు మండలంలో వడ్డెరలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు.యువతతో పాటు పార్టీ కోసం నిరంతరం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు స్థానిక ఎన్నికల్లో అవకాశాలు కల్పించడం ద్వారా వారికి గుర్తింపు లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

వర్షాలు పడాలంటూ ముస్లిం మత పెద్దల ప్రత్యేక ప్రార్థనలు

- ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు



కూకట్ పల్లి మన జనప్రగతి అక్టోబర్ 11:-హైదర్ నగర్ డివిజన్ పరిధి హైదర్ నగర్ గ్రామంలోని ఈద్గా దగ్గర తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు సరిగ్గా పడక రైతులు అల్లాడుతున్నారని భవిష్యత్తులో కరువు కాటకాల నుంచి అల్లా కాపాడాలంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదర్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు హాజరై ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలానాలు దువా పట్టించి తెలుగు రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని భవిష్యత్తులో కరువు కాటకాలు రావద్దని అల్లాకు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో హైదర్ నగర్ డివిజన్ ముస్లిం సోదరులు హబీబ్,మహమ్మద్ షరీఫ్, మహమ్మద్ ఫస్సియుద్దీన్, యాసీన్ స్థానిక ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలో అవ్వారు రవి శంకర్‌కు చోటు

● అవకాశం కల్పించిన పవన్ కళ్యాణ్‌కి, అతికారి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపిన రవి శంకర్



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 11:-రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలోని నిర్వాహక దళ్ సభ్యునిగా సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామానికి చెందిన అవ్వారు రవి శంకర్‌కు స్థానం లభించింది. ఈ సందర్భంగా ఆదివారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, తనకు అవకాశం కల్పించిన రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కూటమి అభ్యర్థుల విజయానికి శ్రమిస్తానని రవి శంకర్ పేర్కొన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ యువతకు రాజకీయాల్లో ప్రోత్సాహం అందిస్తున్నారని, యువత రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములై స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాలకు కూటమి పార్టీల్లో ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, తనతో పాటు కమిటీ సభ్యులుగా నియమితులైన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాయలసీమ అస్తిత్వ కథకుడు వెంకటకృష్ణ



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 11:- రాయలసీమ కరువు, ఫ్యాక్షన్, కులవివక్ష వంటి ప్రాంతీయ సమస్యలను కథల్లో ప్రతిబింబించిన రచయిత జి. వెంకటకృష్ణ రాయ లసీమ అస్తిత్వ కథకుడని ప్రముఖ కథా రచయిత సుంకేజి దేవేంద్రాచారి అన్నారు.యోగి వేమన విశ్వవిద్యాలయం సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహించిన 155వ 'నెలనెలా సీమ సాహిత్యం' సదస్సులో భాగంగా ఆదివారం 'నీలమెరుపు' కథల్లో సీమ సమస్యలపై ఆయన ప్రసంగించారు. ప్రాజెక్టుల నిర్మాణ లోపాలు, రుణ సమస్యలు, సామాజిక అసమానతలను వెంకటకృష్ణ తన కథల్లో వివరించారని తెలిపారు.సభాధ్యక్షత వహించిన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి మాట్లాడుతూ, దేవేంద్రాచారి కథల్లో పల్లెజీవితం, దళితుల సమస్యలు, రాయలసీమ మాండలికం సహజంగా ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, పరిశోధకులు, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సాయి నగర్ ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన పుత్తా బాబు



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 11:-మండలంలోని సాయినగర్ గ్రామంలో ఉన్న శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి, సీతారామ లక్ష్మణ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ఎనిమిదో వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమర్‌నాథ్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పీఆర్‌బీ హ్యాండ్లూమ్స్ అధినేత పుత్త రామభద్రయ్య కుటుంబ సభ్యులు దుర్గామాత విగ్రహాన్ని సమర్పించడంతో పాటు గత ఎనిమిదేళ్లుగా దసరా ఉత్సవాలకు సహకరిస్తున్నారని అర్చకులు తెలిపారు. గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు పుత్తా బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సిరిసంపదలతో వర్ధిల్లాలని, రాష్ట్ర అభివృద్ధికి, కూటమి ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

- **16న గరుడ వాహనం.. 17న పుష్పక విమానం**
- **19న స్వర్ణరథం.. 20న చక్రస్నానం**



తిరుపతి, మన జనప్రగతి, అక్టోబర్ 11:- తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం, రాత్రి వివిధ వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబర్ 16న గరుడ వాహన సేవ, 17న పుష్పక విమానం, 19న స్వర్ణరథోత్సవం, 20న చక్రస్నానం నిర్వహించనున్నారు.ఉత్సవాల్లో భాగంగా 12న పెద్దశేష వాహనం, 13న చిన్నశేష, హంస వాహనాలు, 14న సింహ, ముత్యపుపందిరి వాహనాలు, 15న కల్పవృక్ష, సర్వభూపాల వాహన సేవలు జరగనున్నాయి. 16న ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. 17న హనుమంత వాహనం, పుష్పక విమానం, గజ వాహన సేవలు, 18న సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు, 19న స్వర్ణరథం, అశ్వ వాహన సేవలు ఉంటాయి. చివరి రోజైన 20న ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు.సాధారణంగా ఉదయం వాహన సేవలు 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. గరుడ వాహన సేవ మాత్రం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11.30 గంటల వరకు నిర్వహించనున్నారు. అధికమాసం వచ్చే సంవత్సరాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలతో పాటు నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు.

రైతుల నుంచి 2.84 లక్షల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు

- రూ.1,944.43 కోట్ల నిధులు విడుదలయ్యాయి: మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, మన జనప్రగతి, అక్టోబర్ 11:- రైతుల నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, నిధుల విడుదలపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న విమర్శలను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఖండించారు. 202425 ఖరీఫ్ నుంచి 202526 రబీ వరకు 1,50,747 మంది రైతుల నుంచి 2,84,045.60 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1,944.43 కోట్లు విడుదల చేసిందని వివరించారు.202425లో రూ.821.37 కోట్లు, 202526లో రూ.1,123.06 కోట్లు విడుదలైనట్లు పేర్కొన్నారు. కందులు, శనగలు, మినుములు, పెసలు తదితర పంటల కొనుగోళ్లు చేపట్టినట్లు తెలిపారు.ఖరీఫ్2026 పంటల కొనుగోళ్లకు సంబంధించి మార్క్‌ఫెడ్ ఆగస్టు 17న ప్రతిపాదనలు సమర్పించగా, రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 23న కేంద్రానికి పంపిందని మంత్రి వెల్లడించారు. కొనుగోళ్లు, రైతులకు సకాలంలో చెల్లింపుల కోసం 15 శాతం రివాల్వింగ్ ఫండ్‌తో పాటు రూ.300 కోట్ల అర్థిక సహాయం కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉందన్నారు.రైతుల సంక్షేమం కోసం కనీస మద్దతు ధరకు పంటల కొనుగోళ్లకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల పేరుతో రాజకీయాలు చేయకుండా, అధికారిక గణాంకాల ఆధారంగా విమర్శలు చేయాలని సూచించారు.

పులివెందుల మున్సిపల్ చైర్మన్ పదవి ఓసీ మహిళకె ?

- **రిజర్వేషన్లపై అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు**



పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 11:- పులివెందుల మున్సిపాలిటీ చైర్మన్ పదవికి ఈసారి ఓసీ మహిళ కేటగిరీ రిజర్వేషన్ ఖరారయ్యే అవకాశం ఉందంటూ స్థానికంగా సమాచారం ప్రచారంలో ఉంది. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత వచ్చిన తర్వాతే చైర్మన్ పదవికి పర్తించే కేటగిరీపై తుది నిర్ణయం వెల్లడికానుంది.పులివెందుల మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి చైర్మన్ పదవికి వివిధ రిజర్వేషన్ కేటగిరీలు అమలైనట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. మొదటి పర్యాయం బీసీ మహిళకు, రెండో పర్యాయం ఓసీ మహిళకు, అనంతరం బీసీ జనరల్ కేటగిరీకి అవకాశం వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి ఏ వర్గానికి కేటాయిస్తారన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ పదవి ఓసీ మహిళ కేటగిరీకి కేటాయించే అవకాశం ఉందన్న ప్రచారం వినిపిస్తోంది. అయితే బీసీ రిజర్వేషన్ల శాతం, స్థానిక సంస్థల వారీగా అమలు చేసే రిజర్వేషన్లు, రోస్టర్ విధానం, ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగానే తుది కేటాయింపు జరగనుంది.మున్సిపల్ చైర్మన్ పదవిపై ఆసక్తి చూపుతున్న ఆశావహులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధికారిక రిజర్వేషన్ జాబితా కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చిన తర్వాత ఆయా పార్టీల్లో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. అప్పటివరకు ఓసీ మహిళ రిజర్వేషన్‌పై వస్తున్న సమాచారాన్ని అధికారిక నిర్ణయంగా పరిగణించలేమని గమనించాలి.

ఓం శక్తి ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం: ఎమ్మెల్యే పులివర్తి నాని

- ప్రజల్లో భక్తి భావం పెంపొందాలి: తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి




తిరుపతి, మన జనప్రగతి, అక్టోబర్ 11:- మల్లంగుంట చెక్‌పోస్టు సమీపంలోని ఓం శక్తి అమ్మవారి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన 1008 మంత్రాల కుంకుమార్చన కార్యక్రమంలో తుడా చైర్మన్ డాక్టర్ సి. దివాకర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. అఖండ జ్యోతి వెలిగించి పూజలు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయానికి అవసరమైన స్థలం మంజూరుకు అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించడంతో పాటు సేవా కార్యక్రమాలకు సహకరిస్తామని తెలిపారు.మేల్ మరువత్తూర్ ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక సేవా సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు టి. గంగాధరం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 30 మంది మహిళలకు కుట్టు మిషన్లు, పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రికల్ టూల్ కిట్లు, గ్యాస్ స్టవ్‌లు, వంట సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం సుమారు 1,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, ఓం శక్తి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తూతూమంత్రంగా కూల్చివేతలు..

- **ముడుపుల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు**
- **అడ్డగుట్టలో అక్రమ నిర్మాణాలపై రగిలిపోతున్న స్థానికులు.!**





కూకట్‌పల్లి మన జనప్రగతి అక్టోబర్ 11:- ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని అడ్డగుట్ట అక్రమ నిర్మాణాల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్న తీరుపై స్థానికుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ప్లాట్ నంబర్లు 183, 184లలో కేవలం రెండు అంతస్తుల అనుమతులు తీసుకుని ఏకంగా ఆరు అంతస్తుల మేర ఆకాశహర్మ్యాలను నిర్మిస్తూ, ప్రమాదకరమైన హైటెన్షన్ విద్యుత్ వైర్ల కిందే నిబంధనలను బేఖాతరు చేస్తూ పనులు కొనసాగిస్తున్నారు. స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తినప్పటికీ, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం భారీగా లంచాలు మింగి కంటితుడుపు చర్యలతో చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి.కూల్చివేతల పేరుతో క్షేత్రస్థాయికి వచ్చిన అధికారులు, అక్రమ భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేయాల్సింది పోయి, కేవలం పైనున్న పెంట్ హౌజ్ గోడలకు, స్లాబ్‌కు చిన్న చిన్న రంధ్రాలు మాత్రమే చేసి తూతూమంత్రంగా నాటకమాడటం గమనార్హం.బిల్డర్లతో చేతులు కలిపిన కొందరు దళారులు, అధికారులు కుమ్మక్కై పచ్చటి నెట్లు కప్పి మరీ ఈ అక్రమ దందాను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నాసిరకం, అక్రమ నిర్మాణాలతో ఇప్పటికే అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా అధికార యంత్రాంగంలో ఏమాత్రం చలనం రాకపోవడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నామమాత్రపు నాటకాలను ఇకపై సహించేది లేదని, అధికారులు వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులన్నింటినీ కఠినంగా కూల్చివేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని స్థానిక కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు తేదీలు ఖరారు

- **అక్టోబర్ 12 నుంచి 17 వరకు మండలాల వారీగా ప్రక్రియ**
- **బాధితులు, ఏజెంట్లు అవసరమైన పత్రాలతో హాజరుకావాలి**

బొమ్మనహాల్, అక్టోబర్ 11 (మన జనప్రగతి): అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన ప్రక్రియను అక్టోబర్ 12 నుంచి 17వ తేదీ వరకు అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలోని షాదీఖానాలో నిర్వహించనున్నారు. బాధితులు, ఏజెంట్లు తమకు కేటాయించిన తేదీల్లో అవసరమైన పత్రాలతో హాజరుకావాలని అధికారులు సూచించారు.మండలాల వారీగా అక్టోబర్ 12న లేపాక్షి, రొద్దం, 13న బొమ్మనహాల్, కంబదూరు, 14న కుదేరు, ఓబులదేవరచెరువు, 15న సోమందేపల్లి, 16న డి. హీరేహాల్, 17న బ్రహ్మసముద్రం మండలాలకు చెందిన బాధితుల బాండ్లను పరిశీలించనున్నారు. బాధితులు ఒరిజినల్ బాండ్లు, కలర్ జిరాక్స్, ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఫొటో, ఫోన్ నంబరుతో రావాలి. ఒరిజినల్ బాండ్లను అధికారులకు అప్పగించకుండా పరిశీలనకు మాత్రమే చూపించాలని సూచించారు. బాండ్ కలర్ జిరాక్స్‌పై సంతకం చేసి అందజేయాలి. డిపాజిటర్ మరణించిన సందర్భంలో మరణ ధ్రువీకరణ పత్రం, వారసత్వ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలి. ఏజెంట్లు తమ ఏజెంట్ కోడ్‌తో పాటు గుర్తింపు, బ్యాంకు పత్రాలు సమర్పించాలి. సందేహాల నివృత్తికి కే. దస్తగిరి (7032397109), ఏ. అశోక్ (8074564661), జి. ప్రీతమ్ రెడ్డి (9000099 309)లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

బాల త్రిపుర సుందరిగా అంకాలమ్మ తల్లి దర్శనం

- అంకాలమ్మగూడూరులో వైభవంగా దసరా ఉత్సవాలు



సింహాద్రిపురం మన జనప్రగతి అక్టోబర్ 11:సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరు గ్రామ దేవత అంకాలమ్మ తల్లి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు భక్తులకు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి విశేష అలంకారంలో దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు,విశేష అర్చనలు నిర్వహించారు.స్థానిక గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వేంపల్లిలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు


- వేంపల్లె సిఐ నరసింహులు



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 11:-స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, పులివెందుల డిఎస్పి మురళి ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున వేంపల్లిలోని హనుమాన్ జంక్షన్, కడప -పులివెందుల హైవే రోడ్డులో వేంపల్లి సీఐ నరసింహులు వాహనాల తనిఖీ నిర్వహించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వాహనాల్లో నగదు, మద్యం ఇతర వాటిని ఏమైనా తరలిస్తున్నారా లేదా అన్న విషయమై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అంతేకాకుండా ఎవరైనా అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నారా అనే విషయమై వారు ఆరా తీశారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఇప్పటినుంచే ముందు జాగ్రత్త చర్యగా అన్ని వాటిపైన ప్రత్యేక నిఘా ఉంచామని సీఐ వెల్లడించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పత్తికొండలో దసరా నవరాత్రుల సందర్భంగా పూజలు
- నాయకులు, కార్యకర్తలకు శ్రీ దుర్గామాత నవరాత్రుల శుభాకాంక్షలు



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 11:-దసరా నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకొని పత్తికొండలోని దుర్గామాత దేవాలయాలను సందర్శించి, అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పత్తికొండ మాజీ మండల అధ్యక్షురాలు ఎస్.ఆర్. నాగరత్నమ్మ, ఆలూరు నియోజకవర్గ పరిశీలకులు ఎస్.ఆర్. రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.

బాలికల హక్కులను కాపాడాలి



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 11:- బాలికల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, లింగ అసమానతలు, విద్యా, పోషకాహారం, వివాహాలు, బాలికల చట్ట పరమైన హక్కులపై అవగాహన పెంపొందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. ఆదివారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా మహిళ అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న విద్యా పోషణ చట్టపరమైన వైద్య సంరక్షణ రక్షణ హింస బలవంతపు బాల్య వివాహాలపై వివక్షత వంటి వాటిపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. మహిళ నాయకులు భాగ్యలక్ష్మి, కర్రెమ్మ, చిట్టెమ్మ నాగమద్దమ్మ మీనాక్షి దానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో నేడు 'దేవప్రశ్న' పూజా మహోత్సవం

- ఆలయ పునఃశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక క్రతువు



పులివెందుల, మన జనప్రగతి, అక్టోబర్ 11:- పులివెందుల పట్టణంలోని అత్యంత పురాతన శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో ఆలయ పునఃశక్తి కార్యక్రమంలో భాగంగా నేడు 'దేవప్రశ్న' పూజా మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి, దైవజ్ఞులు శ్రీ డి.ఎస్. మహేంద్ర కుమార్ నేతృత్వంలోని సిద్ధాంతుల బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే పూజా కార్యక్రమాలు సాయంత్రం వరకు కొనసాగుతాయని శ్రీ రంగనాథ స్వామి భక్త సమాజం వెల్లడించింది.ఆలయ సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం నిర్వహించే 'దేవప్రశ్న' కార్యక్రమంలో ఆలయ పూజా విధానాలు, ఆచారాలు, ఆలయ నిర్వహణకు సంబంధించిన అంశాలను సంప్రదాయ జ్యోతిష్య పద్ధతుల ద్వారా పరిశీలిస్తారు. కార్యక్రమం అనంతరం అవసరమైన పరిహార క్రతువులపై దైవజ్ఞులు సూచనలు అందిస్తారు.కేరళతో పాటు దక్షిణ భారతదేశంలోని పలు ఆలయాల్లో ఈ సంప్రదాయం ఆచరణలో ఉంది. ఆలయ పవిత్రత, పూజా విధానాల పరిరక్షణకు సంబంధించిన అంశాలను సంప్రదాయబద్ధంగా పరిశీలించే కార్యక్రమంగా దీనిని నిర్వహిస్తారు.ఈ పూజా మహోత్సవంలో భక్తులందరూ పాల్గొని శ్రీ రంగనాథ స్వామి వారి కృపకు పాత్రులు కావాలని శ్రీ రంగనాథ స్వామి భక్త సమాజం కోరింది.

వైభవంగా వాసవి అమ్మవారి దసరా ఉత్సవాలు ప్రారంభం..

- బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 11:పులివెందుల వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా అంకురార్పణతో ప్రారంభమయ్యాయి.నవరాత్రి వేడుకల ప్రారంభం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు నవీన్ కుమార్ శర్మ,ఓలమయ్య శర్మల పర్యవేక్షణలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మరియు అనుబంధ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచే విశేష అభిషేకాలు,వాస్తు పూజ, చండీ హోమం తదితర వైదిక క్రతువులు జరిగాయి.ఉత్సవాల తొలిరోజు సాయంత్రం వాసవి అమ్మవారు 'శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి' దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు,విశేష పూజలు ఉంటాయని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల తనిఖీలు

- ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసుల చర్యలు



కడప, మన జనప్రగతి అక్టోబర్ 11:- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా పోలీసులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ, ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు.పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలతో సమావేశమై ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా సహకరించాలని కోరుతున్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, చట్టాన్ని గౌరవిస్తూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, ఏవైనా సమస్యలు సృష్టించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్టమైన బందోబస్తు, ముందస్తు నివారణ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలు, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా



జమ్మలమడుగు, మన జనప్రగతి అక్టోబర్ 11:- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన ముందస్తు చర్యలపై జమ్మలమడుగు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.ఎన్నికల బందోబస్తు, సమస్యాత్మక గ్రామాలు, సున్నిత ప్రాంతాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల పరిస్థితులు, అవాంఛనీయ ఘటనల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులు సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని డీఎస్పీ సూచించారు.సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు, రూరల్ సీఐ కుళ్లాయప్ప, ముద్దనూరు సీఐ నగేష్ బాబు, కొండాపురం సీఐ రాజా, యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

స్పెయిన్‌లో మంత్రి దుర్గేష్ పర్యటన ముగింపు

- ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం



అమరావతి, మన జనప్రగతి, అక్టోబర్ 11:- ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా మంత్రి కందుల దుర్గేష్ చేపట్టిన మూడు రోజుల స్పెయిన్ పర్యటన ముగిసింది. సెవిల్లె నగరంలో నిర్వహించిన 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్2026'లో పాల్గొన్న మంత్రి, రాష్ట్రంలోని పర్యాటక అవకాశాలను అంతర్జాతీయ సంస్థలకు వివరించారు. రాష్ట్రంలోని 100కు పైగా ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు వారి సొంత భాషలో సమాచారం అందించేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపారు. సముద్రతీరం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యావరణ పర్యాటకం, రిసార్టుల రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని స్పెయిన్ పెట్టుబడిదారులకు ఆహ్వానం పలికారు.

బతుకమ్మ వచ్చింది.. కానీ మా బతుకులు మారలేదు!

- కాటారం యువతకు ఉపాధి కల్పించాలి..
రెండు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



కాటారం, మన జనప్రగతి అక్టోబర్ 11: కాటారం డివిజన్‌లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, గతంలో కోకాకోలా, సిమెంట్ పరిశ్రమల్లో ఉద్యోగాలు కోల్పోయిన యువకులకు న్యాయం చేయాలని విప్లవ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఆత్మూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. చింతకాని క్రాస్ వద్ద శ్రీపాదరావు విగ్రహం సమీపంలో నిరసన చేపట్టారు. శ్రీకాంత్ మాట్లాడుతూ, శ్రీపాదరావు విగ్రహానికి బంగారు పూత ఉన్నా యువత జీవితాల్లో మాత్రం వెలుగులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక ఐదు మండలాల యువత పట్టణాలకు వలస వెళ్తున్నారని పేర్కొన్నారు. కాటారం డివిజన్‌లో కనీసం రెండు పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని, ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. యువతకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పేకాట ఆడుతున్న 8 మంది అరెస్ట్

- రూ.15,300 నగదు, 6 సెల్‌ఫోన్లు,
3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నస్పూర్, మన జనప్రగతి అక్టోబర్ 11:రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నగదు పెట్టి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం టాస్క్‌ఫోర్స్, నస్పూర్ పోలీసులు సంయుక్తంగా ఏఎస్ఆర్ నగర్‌లో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు.ఈ దాడిలో ముద్దసాని సదానందం, ఆచే రవి, పాదాల సంజీవ్, నాగపురి మహేష్, దుర్గం శ్రీనివాస్, దంతాల శ్రీనివాస్, రాజవరపు వెంకటేశ్వర్లు, జడల రాజమౌళిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.15,300 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నస్పూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అక్రమ జూదం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

నాయిని రాజేందర్ రెడ్డి అన్నకు హృదయపూర్వక కృతజ్ఞతలు



హన్మకొండ మన జనప్రగతి అక్టోబర్ 11: నాయిని రాజేందర్ రెడ్డి అన్న నాపై నమ్మకంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 31వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించిన సందర్భంగా డిసిసి కార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. మామిళ్ల సురేష్ మాట్లాడుతూ... వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,బట్టి శీనన్న,తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజన్న డివిజన్ ఇంచార్జి మార్క విజయ్ కుమార్,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,కాంగ్రెస్ నాయకులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,పార్టీ బలోపేతానికి మరియు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను.అదే ఉత్సాహంతో అదే పట్టుదలతో పార్టీ జెండా అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తాను అని హనుమకొండ జిల్లా డి సి సి కార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్ ఈ సందర్భంగా తెలిపారు.

దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలి

- ఐదవ రోజుకు చేరుకున్న వామపక్షాల రిలే నిరాహార దీక్షలు
- రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి: వామపక్ష నాయకులు



దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 11:-దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే దేవనకొండను కరువు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు బి. వీరశేఖర్, మాజీ జెడ్పీటీసీ కిట్టు, రైతు నాయకుడు నీలి రాజశేఖర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు పరిస్థితుల కారణంగా మండలంలోని రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో జీవనోపాధి పొందడం కూడా కష్టంగా మారిందని పేర్కొన్నారు. కరువు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణమే దేవనకొండను కరువు మండలంగా ప్రకటించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.ఐదవ రోజు దీక్షలో పి. కోటకొండ గ్రామానికి చెందిన రైతులు హరిశ్చంద్ర, సూరి సంజన్న, కథాలు, నాగరాజు, శివ, లక్ష్మన్న, మార్కండేయులు, అనిల్, పెద్ద కథాలు, పెద్ద కౌలుట్ల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్, తిప్పన్న, బంగారు రాజశేఖర్, జుబేరు, ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, రామాంజనేయులు, కాంగ్రెస్ నాయకుడు కాసిం తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కి 5 లక్షలు ఆర్థిక సాయం



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 11:-రాయచోటి పట్టణంలోని రెండు అన్నా క్యాంటీన్లలో ఇప్పటివరకు 12 లక్షల ఉచిత భోజనాలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభీష్టం మేరకు మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.60 లక్షల వ్యయంతో ఈ సేవలు అందిస్తున్నారనీ తెలిపారు ఆదివారం క్యాంటీన్ నిర్వాహకులకు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించారు. పేదలు, కూలీలు, వృద్ధులకు ఈ క్యాంటీన్లు ఉపయోగపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

వాసవి క్లబ్ జిల్లా అధ్యక్షునిగా పబ్బతి దక్షిణామూర్తి

- అభినందనలు తెలిపిన పులివెందుల ఆర్యవైశ్య సంఘ సభ్యులు అనుబంధ సంఘాలు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 11:కడప జిల్లా 2026 గవర్నర్ పదవికి పబ్బతి దక్షిణామూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా దక్షిణామూర్తిని పులివెందుల ఆర్యవైశ్య సంఘ సభ్యులు అనుబంధ సంస్థలు అభినందనలు తెలియజేశాయి. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరెన్నిక గల వాసవి క్లబ్ వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తూ తనదైన గుర్తింపు పొందిన సంస్థగా కొనియాడ పడుతున్న నేపథ్యంలో పులివెందుల వాసి దక్షిణామూర్తి జిల్లా గవర్నర్ పదవికి ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సహకారం సేవా కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని,విద్య వైద్యం సామాజిక సేవకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడతామని తన ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, అనుబంధ సంఘాల సభ్యులు,వాసవి సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 11:-గాలివీడు మండలం కుమ్మరిపల్లెలో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాలివీడు మండలం కుమ్మరిపల్లె గ్రామంలో 'రెడ్స్' సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులు, గ్రామ పెద్దలు అందరూ కలిసి అత్యంత ఉత్సాహంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.బాలికల హక్కులను కాపాడుతూ..సమాజంలో వారికి సమాన అవకాశాలు కల్పించాలని, వారి రక్షణ, విద్య మరియు సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. బాలికలను రక్షించుకుందాం సమాజంలో వారికి భద్రత కల్పిద్దాం" అనే నినాదాలతో గ్రామ వీధులు మార్మోగాయి.ఈ కార్యక్రమంలో రెడ్స్ సంస్థ సిబ్బంది కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎఫ్ సి భారతమ్మ, ఎన్ ఎఫ్ నాగేశ్వరి,గ్రామ పెద్దలు, పిల్లలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాలికల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఎస్ఐఆర్ పేరుతో ఓటు చోరీకి పాల్పడ్డారని కాంగ్రెస్ ఆరోపణ

ఇండియా కూటమి ఆధ్వర్యంలో కడపలో నిరసన ప్రదర్శన



కడప మన జనప్రగతి అక్టోబర్ 11:-ఎస్ఐఆర్ పేరుతో ఓటు చోరీకి పాల్పడుతూ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గౌస్ పీర్ డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ ఇండియా కూటమి ప్రతినిధులతో కలిసి నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కడపలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.నగరంలోని ఏకే ఫంక్షన్ హాలు నుంచి ఏడురోడ్ల కూడలి వరకు జ్ఞానేశ్ కుమార్ ముఖచిత్రం ఉన్న ప్రతిరూపాన్ని తాళ్లతో కట్టి లాగుతూ ప్రదర్శన చేపట్టారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి తనకు నచ్చిన పార్టీకి, నాయకుడికి ఓటు వేసే హక్కు కల్పించిందన్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అండతో జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఓటు హక్కును, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుత నిరసనలు చేపడుతున్న వారిని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ వంటి సంస్థల ద్వారా ఉద్యమకారులపై సోషల్ మీడియా వేదికగా దాడులకు ప్రోత్సాహం అందిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రతిష్ఠను కాపాడేందుకు జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా కాటం మహేష్ ఏకగ్రీవ ఎన్నిక



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 11:వేంపల్లె మండల ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మహేష్ స్టూడియోకు చెందిన కాటం మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వేంపల్లి లోని వైఎస్సార్ పార్కులో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వేంపల్లి మండలానికి చెందిన ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఆదివారం స్థానిక వైఎస్సార్ పార్కులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫోటో స్టూడియో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అసోసియేషన్ అధ్యక్షుడిగా కాటం మహేష్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా సాయిరాం స్టూడియోకు చెందిన దివాకర్ రెడ్డి, డేరంగుల బాబు ఎన్నికయ్యారు. సెక్రటరీలుగా సూరి, శంకర్ రెడ్డి, గంగూలీ ,మార్క్ తదితరులు కార్యవర్గంలో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కాటం మహేష్ మాట్లాడుతూ యూనియన్ లోని ప్రతి ఫోటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్‌కు కష్టసమయాల్లో అండగా నిలిచి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.ఫోటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు విధులు ముగించుకుని రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాంటి సందర్భాల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు యూనియన్ తరపున ఇన్సూరెన్స్ పాలసీలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.అలాగే, విధి నిర్వహణలో పోలీసులకు తమ గుర్తింపును తెలియజేసేందుకు ప్రతి సభ్యుడికి ఐడీ కార్డులు మంజూరు చేయించే ప్రయత్నం చేస్తామన్నారు.త్వరలోనే నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారుఈ సమావేశంలో వేంపల్లి మండలానికి చెందిన పలువురు ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాం.. కూటమి ప్రభుత్వం మోసం చేసింది

కర్నూలులో భూమన కరుణాకర్‌రెడ్డికి స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ

పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 11:-వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ భూమన కరుణాకర్‌రెడ్డి కర్నూలుకు విచ్చేసిన సందర్భంగా పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నిరంకుశ పాలన కొనసాగుతోందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అన్ని స్థానాల్లో బలంగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.3 లక్షల కోట్లను సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజలకు అందించామని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారులు జాప్యం చేస్తే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్‌రెడ్డి, మణిగాంధీ, నియోజకవర్గ ఇన్‌చార్జులు రాజీవ్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, మాజీ కూడాచైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి తదితరులు పాల్గొన్నారు.

కడప డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన టీ. భవాని

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి ఖాకీ కొలువు వరకు ప్రస్థానం

గ్రూప్-1లో 15వ ర్యాంకుతో డీఎస్పీగా ఎంపిక

ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యం



కడప మన జనప్రగతి అక్టోబర్ 11:-ఇంట్లో అందరూ ప్రేమగా 'చిన్ని' అని పిలుచుకునే టీ. భవాని లక్ష్య సాధనలో మాత్రం చిరుత వేగంతో ముందుకు సాగారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి ప్రభుత్వ సేవల్లోకి అడుగుపెట్టి, డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ గ్రూప్-1లో 15వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎదిగారు. తాజాగా కడప పోలీస్ సబ్‌డివిజన్ డీఎస్పీగా ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.కదిరికి చెందిన భవాని హిందూపురంలో విద్యాభ్యాసం పూర్తి చేసి కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలో విజయం సాధించి డిప్యూటీ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. కడప జిల్లాలో మూడేళ్లపాటు విధులు నిర్వహించారు. ఆ తర్వాత ఏపీపీఎస్సీ నిర్వహించిన 2022 గ్రూప్-1 పరీక్షల్లో 15వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. గతంలో శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ డీఎస్పీగా పనిచేస్తున్న ఆమెను ఉన్నతాధికారులు కడపకు బదిలీ చేయడంతో కొత్త బాధ్యతలు చేపట్టారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ భవాని మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను సహించబోమని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని భావించే వారు, తప్పుడు ఫిర్యాదులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు నేరుగా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. ఫిర్యాదుదారుల వాదనతోపాటు సంబంధిత పోలీసు అధికారుల వివరణలను పరిశీలించి వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఎవరి మాటనో మాత్రమే నమ్మి ఏకపక్షంగా వ్యవహరించబోమని స్పష్టం చేశారు.విద్యాభ్యాసం నుంచి ఉద్యోగ సాధన వరకు పట్టుదలతో ముందుకు సాగిన భవాని, ఇప్పుడు కడపలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నారు. ప్రజలు పోలీసు శాఖపై నమ్మకంతో తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టబద్ధంగా న్యాయం అందించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

జగన్ కేసుల విచారణ వేగవంతం చేసి వాస్తవాలు వెల్లడించాలి

● **ఈడీ విచారణకు రాజకీయ రంగు పులమడం సరికాదు: మంత్రి కొల్లు రవీంద్ర**




మంగళగిరి, మన జనప్రగతి, అక్టోబర్ 11:- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉన్న ఆర్థిక నేరాల కేసుల విచారణ నుంచి తప్పించుకునేందుకు కాలయాపన చేస్తున్నారని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. దర్యాప్తు సంస్థల విచారణను రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించడం సరికాదని అన్నారు.ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జగన్‌పై నమోదైన ఆర్థిక నేరాల కేసుల్లో విచారణను వేగవంతం చేసి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలు వేర్వేరు అంశాలకు సంబంధించినవని, చట్ట ప్రకారం దర్యాప్తు సంస్థలు తమ విధులను నిర్వహిస్తాయని పేర్కొన్నారు. జగన్‌పై ఉన్న కేసులు, డిశ్చార్జ్ పిటిషన్లు, కోర్టు విచారణల అంశాలను ప్రస్తావిస్తూ, న్యాయ ప్రక్రియకు సహకరించాలని మంత్రి సూచించారు. ఈడీ విచారణను రాజకీయ వివాదంగా మార్చడం ద్వారా ప్రజల్లో అపోహలు కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.వివేకానందరెడ్డి హత్య కేసును కూడా ప్రస్తావించిన కొల్లు రవీంద్ర, ఈ అంశంపై గతంలో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటుచేసుకున్నాయని అన్నారు. దర్యాప్తు సంస్థలపై విమర్శలు చేయడం కంటే విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావడమే ముఖ్యమని పేర్కొన్నారు.ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల విచారణ త్వరితగతిన పూర్తిచేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. జగన్, వైఎస్సార్‌సీపీ నేతలు వాస్తవాల ఆధారంగా స్పందించాలని సూచించారు.

పులివెందుల శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో నేడు దేవ ప్రశ్న పూజా మహోత్సవం

ఆలయ పునఃశక్తి, క్షేత్ర దోష నివారణే లక్ష్యం

కేరళ సిద్ధాంతి డి.ఎన్. మహేంద్ర కుమార్ నేతృత్వంలో ప్రత్యేక క్రతువు

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆహ్వానం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 11:- పులివెందుల పట్టణంలోని అత్యంత పురాతన శ్రీ రంగనాథ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆలయ పునఃశక్తి, క్షేత్ర దోష నివారణ లక్ష్యంగా సోమవారం (అక్టోబర్ 12) 'దేవ ప్రశ్న' పూజా మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి, దైవజ్ఞుడు డి.ఎన్. మహేంద్ర కుమార్ నేతృత్వంలోని సిద్ధాంతుల బృందం ఈ క్రతువును నిర్వహించనుంది. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం కొనసాగనుంది.దేవ ప్రశ్న అనేది ఆగమ శాస్త్రం, జ్యోతిష్య సంప్రదాయాల ఆధారంగా నిర్వహించే ప్రత్యేక క్రతువు. ఆలయ ఆచారాలు, పూజా విధానాలు, క్షేత్రానికి సంబంధించిన అంశాలను సంప్రదాయ పద్ధతుల్లో పరిశీలించి, అవసరమైన పరిహార క్రతువులను సూచించడం దీని ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి క్రతువును ప్రారంభిస్తారు. అనంతరం ద్వాదశ రాశులు, నవగ్రహ స్థానాలకు అనుగుణంగా ప్రశ్న మండలాన్ని రూపొందించి పూజలు నిర్వహిస్తారు. సంప్రదాయ పద్ధతుల్లో నిమిత్తాలను పరిశీలించడంతో పాటు తాంబూలం, కవడుల గణన, రాశిచక్ర విశ్లేషణ వంటి ఘట్టాలు చేపడతారు.ఆలయ ప్రతిష్ఠా సమయం, గ్రహస్థితులు, పూజా విధానాలకు సంబంధించిన అంశాలను సంప్రదాయబద్ధంగా పరిశీలించిన అనంతరం అవసరమైన పరిహార క్రతువులపై సిద్ధాంతులు సూచనలు అందించనున్నారు. అవసరాన్ని బట్టి ఆలయ శుద్ధి, మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం వంటి కార్యక్రమాలను సూచించే అవకాశం ఉంది.ఈ పవిత్ర కార్యక్రమంలో పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ రంగనాథ స్వామివారి కృపకు పాత్రులు కావాలని శ్రీ రంగనాథ స్వామి భక్త సమాజం సభ్యులు కోరారు.

అక్టోబర్ 31న ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 11:-అక్టోబర్ 31న నిర్వహించనున్న ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఏఐటీయూసీ తాలూకా సమితి సమావేశం జి. నెట్టికంటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్. కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి ఎన్. లెనిన్ బాబు, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్. లెనిన్ బాబు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ముంబైలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సంఘం కృషి చేసిందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికుల హక్కులకు నష్టం జరుగుతోందని విమర్శించారు. కార్మిక చట్టాల అమలు, న్యాయమైన హక్కుల సాధన కోసం కార్మికులంతా ఐక్యంగా ఉండాలని, రాబోయే రోజుల్లో నిర్వహించే నిరసనలు, ఉద్యమాల్లో పాల్గొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో స్కావెంజర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జొన్నగిరి సుంకమ్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రహిమాన్, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి హెచ్. రంగన్న, అంగన్వాడీ సంఘం కార్యదర్శి టి. కాంతమ్మ, తాలూకా గౌరవ అధ్యక్షుడు బి. మాదన్న, ఉపాధ్యక్షుడు ఎం. రాజప్పతో పాటు అంగన్వాడీ, స్కావెంజర్స్, హమాలీ, గ్రామ పంచాయతీ, ఆటో, భవన నిర్మాణ, పెయింటర్స్ కార్మికులు పాల్గొన్నారు.

మాల ఉద్యోగులంతా ఐక్యతతో ముందుకు సాగాలి



మాల ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేసి సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించాలి

మాల ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మర్రిపాటి నాగరాజు

కడప మన జనప్రగతి అక్టోబర్ 11:-జిల్లావ్యాప్తంగా ఉన్న మాల ఉద్యోగులందరూ ఐక్యతతో ముందుకు సాగుతూ, మాల ఉద్యోగుల సంఘంలో చేరి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని మాల ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మర్రిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఈ సందర్భంగా కడప నగరంలోని వైయస్సార్ ప్రెస్ క్లబ్లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘటితంగా పోరాడి పరిష్కరించుకునే విధంగా సంఘాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.మాల ఉద్యోగులందరూ సమాజ సేవ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, విద్యా, సామాజిక రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదికలు ఏర్పాటు చేయడంతో పాటు, మాల విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.అలాగే హాస్టళ్లను సందర్శించడం, అంబేద్కర్ భవనాల నిర్మాణం, పునరుద్ధరణకు సహకరించడం, మాలవాడలను సందర్శించడం, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఉద్యోగుల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.జిల్లాలోని మాల ఉద్యోగులందరూ సంఘంలో సభ్యులుగా చేరి తమ వివరాలను 86886587 నంబరుకు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు. ఉద్యోగులందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేసి, భవిష్యత్తులో విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, మాల జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, కోశాధికారి కోడూరు స్వతంత్ర బాబు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రుతు ఆరోగ్యమేరి, జాయింట్ సెక్రటరీలు మధుసూదన్, సుదర్శన్, పెంచలయ్య, వై. శేఖర్, గౌరవ సలహాదారులు డాక్టర్ సి.ఎన్.టి. జేషాది వసంత్, నీలకంఠ ప్రసాద్, బండి లెనిన్ ప్రసాద్, తుమ్మలపాటి దివాకర్, వెంకటస్వామి, కోడూరు జయప్రకాష్, చిన్న అనిమెల రాజేష్, మల్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సతీష్ రెడ్డి సమాజ సేవకు అంతర్జాతీయ గుర్తింపు





బద్వేలు మన జనప్రగతి అక్టోబర్ 11:-బద్వేలు గడ్డపై మరో చరిత్రాత్మక ఘట్టం! సామాజిక సేవే ఊపిరిగా, నిరుపేదల కన్నీరు తుడవడమే లక్ష్యంగా సాగుతున్న బద్వేలు ప్రముఖ సామాజిక సేవకుడు పెద్దిరెడ్డి రామ్ సతీష్ రెడ్డి గారికి అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం దక్కింది. ఆయన చేసిన నిస్వార్థ సేవలకు గుర్తింపుగా ప్రఖ్యాత యునైటెడ్ అమెరికన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. బద్వేలు పేరును అంతర్జాతీయంగా మారుమోగించిన రామ్ సతీష్ రెడ్డి గారికి అభినందనల వెల్లువ!బద్వేలు మండలం తంగేడుపల్లికి చెందిన పెద్దిరెడ్డి రామ్ సతీష్ రెడ్డి... పేరులోనే కాదు సేవలోనూ రాముడంతటి వాడు. గత కొన్నేళ్లుగా బద్వేలు నియోజకవర్గ పరిధిలో పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, చదువుకు దూరమైన పేద విద్యార్థులకు చేయూతనివ్వడం, అంతేకాదు... రేపటి తరాల కోసం పచ్చదనం కోసం పలు ప్రాంతాల్లో వేలాది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలోనూ ముందున్నారు. ఆయన చేస్తున్న ఈ నిస్వార్థ, నిరంతర సేవా యజ్ఞాన్ని గుర్తించిన యునైటెడ్ అమెరికన్ విశ్వవిద్యాలయం, గౌరవ డాక్టరేట్ కు ఎంపిక చేసి బద్వేలు ఖ్యాతిని ప్రపంచానికి చాటింది.ఈ ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ ప్రధానోత్సవం ఏప్రిల్ 10, 2026న న్యూఢిల్లీలో జరిగిన గ్లోబల్ కాన్క్లేవ్ 2025 వేదికపై అత్యంత ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, మేధావులు, శాస్త్రవేత్తల సమక్షంలో ఈ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ ఆఫ్ హానర్ గా మాజీ ఇస్రో చైర్మన్, ప్రముఖ శాస్త్రవేత్తలు, అంతర్జాతీయ దౌత్యవేత్త డాక్టర్ హానర్ మురుగేసన్ రాజేంద్రన్, డాక్టర్ వసంత్ జయకుమార్, అంబాసిడర్ డాక్టర్ అనిల్ కుమార్ సింగ్ వంటి దిగ్గజాలు పాల్గొని రామ్ సతీష్ రెడ్డి గారిని అభినందించడం విశేషం.రామ్ సతీష్ రెడ్డి గారికి ఈ అంతర్జాతీయ గౌరవం రావడంపై బద్వేలు నియోజకవర్గ ప్రజలు, యువత, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం జిల్లా కమిటీ తరఫున జిల్లా అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ అనుమల వెంకటేశ్వర్లు గారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.సేవకు గుర్తింపు ఆలస్యమైనా... అంతర్జాతీయ గుర్తింపు దక్కడం నిజంగా అభినందనీయం. పెద్దిరెడ్డి రామ్ సతీష్ రెడ్డి గారు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని మన ఛానల్ తరఫున కూడా మనస్ఫూర్తిగా కోరుకుందాం.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174